AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

WWW.AKSHARATODAYNEWS.COM

10-7-2026 (Friday)

MAIN EDITION


## ఈ–20 పెట్రోల్‌పై కేంద్రం క్లారిటీ





**అక్షరటుడే, ఢిల్లీ:** పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపడం (ఈ20) వల్ల వాహనాల ఇంజిన్లు పాడవుతాయని, మైలేజీ తగ్గిపోతుంద ని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. ఈ మేరకు కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి స్పం దించారు. "ఇది ఒక అపార్థం, దీనిని నేను నమ్మను అని అన్నారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే 20 కోట్ల ద్విచక్ర వాహనాలు, 20 లక్షల కార్లు ఈ ఇంధనాన్ని వాడుతున్నాయి. వాహన తయారీదారులు , మెకానిక్‌ల నుండి కూడా ఎటువంటి ఫిర్యాదులు రాలేదు," అని ఆయన స్పష్టం చేశారు.

## మా కంట్రోల్‌లోనే హర్మూజ్ జలసంధి : అమెరికా

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** అమెరికాఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరోసారి ముదిరాయి. హర్మూజ్ జలసంధి రవాణా మార్గంపై ఇరాన్ చేసిన వ్యాఖ్యలను అగ్రరాజ్యం అమెరికా తీవ్రంగా ఖండించింది. ఈ జలమార్గంపై పూర్తి నియంత్రణ తమదేనని స్పష్టం చేస్తూ, ఇరాన్ చేస్తున్న వాదనలో నిజం లేదని తేల్చిచెప్పింది. హర్మూజ్ జలసంధిపై ఇరాన్‌కు ఎలాంటి నియంత్రణ లేదని అమెరికా స్పష్టం చేసింది. ఈ సంవత్సరం మే నెల నుంచి ఇప్పటివరకు సుమారు 800 వాణిజ్య నౌకలు ఎటువంటి ఆటంకాలు లేకుండా సురక్షితంగా ప్రయాణించాయని వెల్లడించింది. ఈ నౌకల ద్వారా ఏకంగా 380 మిలియన్ బ్యారెళ్ల ముడిచమురు రవాణా జరిగిందని వివరించింది.

## ఆలయంలో భారీ చోరీ..

**అక్షరటుడే, ఏపీ:** ఏపీలోని మార్కాపురం జిల్లా చంద్రశేఖరపురం మండలంలోని చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో భారీ చోరీ జరిగింది. ఆలయంలోకి చొరబడ్డ దుండగులు 100 కిలోలకు పైగా బరువు ఉండే కామాక్షి దేవి, శివుడు, అయ్యప్ప స్వామి పంచలోహ విగ్రహాల్ని ఎత్తుకెళ్లారు. ఈ దృశ్యాలు సీసీటీవీ కెమెరాలో రికార్డయ్యాయి.



## బోనాలకు భారీ ఏర్పాట్లు : మంత్రి కొండా సురేఖ

**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న బోనాలకు భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. గోల్కొండ బోనాల ఏర్పాట్లపై మంత్రి సమీక్షించారు. భక్తుల సౌకర్యార్థం రూ.20 కోట్ల నిధులు కోరామని, షీ టీమ్స్, పారిశుద్ధ్యం, భద్రత పరంగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.




## హరీశ్‌రావు అప్పుడు ఏం చేశారు

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హరీశ్ రావు తమ పార్టీలోకి వస్తానని చెప్తే, పొలిటికల్ అఫైర్స్ కమిటీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. హరీష్ రావు, పదేళ్లు మంత్రిగా ఉండి ఏం చేశారని, మళ్ళీ మూడు నెలల టైమ్ ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో వర్గవిభేదాలను పరిష్కరిస్తామన్నారు.



## మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలి : మంత్రి వాకిటి శ్రీహరి



**అక్షరటుడే, రంగారెడ్డి:** రంగారెడ్డి జిల్లా కోహెడలో రూ.47.03 కోట్ల వ్యయంతో ని ర్మించనున్న ఎగుమతి ఆధారిత హోల్‌సేల్ చేపల మార్కెట్‌కు పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి శుక్రవారం శంకుస్థాపన చేశారు. మత్స్యకారుల సమగ్ర అభివృద్ధి కోసం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న మత్స్య కారులు ఆర్థికంగా ఎదగాలని మంత్రి శ్రీహరి సూచించారు. వారి సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించిన ముదిరాజుల సంక్షేమం కోసం పాటుపడుతానని తెలిపారు. ముదిరాజుల అభివృద్ధి కోసం మంత్రి, ఎమ్మెల్యే పదవికే కాదు.. ప్రాణం ఇవ్వడానికైనా సిద్ధమని పేర్కొన్నారు.

## చక్కెర ఫ్యాక్టరీపై కాలుష్య నియంత్రణ మండలి చర్యలు




**అక్షరటుడే, సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లాలో ని మంజీర నదీ పరివాహక ప్రాంతంలో పారిశ్రామిక కాలుష్యం, చేపల మర ణాలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) ఒక చక్కెర కర్మాగారాన్ని మూసివేయాలని, మరొక కర్మాగారంలో ఉత్పత్తిని నిలిపివేయాలని ఆదేశించింది. వెండికొల్లు సమీపంలో మంజీర నదిలో మార్చి 2026లో చేపలు మరణించిన ఘటనపై విచారణ జరిపిన అనంతరం, సంగారెడ్డిలోని కులుబ్‌గూర్‌లో ఉన్న గణపతి షుగర్ కర్మాగారాన్ని మూసివే యాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆదే శించింది. ఈ ఫ్యాక్టరీ మంజీర నదిలోకి ప్ర వహించే సహజ కాలువకు ఆనుకుని ఉన్న లైనింగ్ లేని మడుగులలోకి మురుగునీటిని విడుదల చేసిందని అధికారులు తెలిపారు. ఆ మడుగుల నుండి లీకైన నీరు కాలువలో కి, చివరికి నదిలోకి చేరింది. దీంతో పెద్ద ఎత్తున చేపలు చనిపోయాయి.

మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తనకు తెలంగాణ ఫస్ట్ అని, తర్వాతే పార్టీ అని తెలిపారు. రాజకీయాల కోసం తెలంగాణ ప్రజలకు నష్టం జరుగుతుంటే చూస్తూ ఊరుకోనని చెప్పారు. చీల్చి చెండాడుతానని హెచ్చరించారు. తాను ఒకరు ఆడిస్తే ఆడే వ్యక్తిని కాదని, స్క్రిప్ట్ రాసిస్తే చదివే వాడిని కాదన్నారు.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



# నాకు తెలంగాణ ఫస్ట్

■ ఆ తర్వాతే పార్టీ ■ ఎంపీ ఈటల రాజేందర్ ■ కాళేశ్వరంపై కీలక వ్యాఖ్యలు

రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై ఈటల రాజేందర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తనకు ఏ పార్టీ, ఏ వ్యక్తిగత అజెండా కంటే కూడా తెలంగాణ ప్రయోజనాలే అత్యంత ముఖ్యమని ఆయన స్పష్టం చేశారు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నా, ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ఉన్నా.. మోటార్లు ఆన్ చేయకపోవడంతో రైతులు పంటలు సాగు చేయలేక ఇబ్బందులు పడుతున్నారని ఈటల విమర్శించారు.

**నీటిపై అవగాహన అవసరం**

ఎస్ఆర్ఎస్పీ కాల్వల కింద కేవలం బోర్లు, బావు లపైనే ఆధారపడి వ్యవసాయం చేయడం అసాధ్య మని, దీనిపై కనీస అవగాహన ఉన్నవారెవరైనా అంగీకరిస్తారని ఈటల అన్నారు. తాను హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తూములు ఎత్తి రైతులకు నీరు అందించినపుడు ఎలాగైతే ప్రశంసలు దక్కాయో, ఒకవేళ ఆ నీరు అందకపోతే వరంగల్ రైతులు కూడా తనను నిలదీసేవారని తన గతాన్ని గుర్తు చేసుకున్నారు.

**కాంగ్రెస్ హయాంలోనే..**

కాళేశ్వరం ప్రాజెక్టు రాకముందు ఉన్న పరిస్థితు లు, ప్రాజెక్టుల చరిత్రను ఈటల వివరించారు. నీళ్లు, నిధులు, ఆత్మగౌరవం అనే నినాదంతోనే తెలంగాణ ఉద్యమం మొదలైందని, అధికారంలో ఉన్నవారు రాజకీయాలకు అతీతంగా మూలా లను గుర్తుంచుకోవాలని సూచించారు. కాళేశ్వ రానికి ముందు వైఎస్సార్ హయాంలో జలయజ్ఞం మొదలైందని, తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత నీటి కోసం అప్పుడే ప్రణాళికలు రూపొందాయని పేర్కొ న్నారు. ఎల్లంపల్లి, మిడ్ మానేరు వంటి ప్రాజెక్టుల శంకుస్థాపన కాంగ్రెస్ హయాంలోనే జరిగిందని, కాళేశ్వరం నీటిని చేవెళ్ల వరకు తీసుకె ళ్లాలనే ఆలోచన కూడా అప్పటిదేనని గుర్తు చేశారు.

**విమర్శలు ఆపండి..**


రాష్ట్రం ఏర్పడ్డాక మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులను అనుసంధానం చేయడంతోనే ఉత్తర తెలంగాణకు నీరు అందుతోందని ఈటల పేర్కొన్నారు. మిడ్ మానేరు డ్యామ్ ఉత్తర తెలంగాణకు ఒక 'నీటి జంక్షన్'గా మారిందని, గతంలో నీటి సౌకర్యం లేని హుజూరాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాలోని పలు ప్రాంతాల్లో నేడు కాళేశ్వరం నీటితో రెండు పంటలు పండుతున్నాయన్నది అక్షర సత్యమని ఆయన అన్నారు. కాళేశ్వరంలో జరిగిన కమీషన్లు, డిజైన్ల మార్పుల గురించి తాను మాట్లాడటం లేదని, అయితే 'ప్రాజెక్టు కట్టడమే తప్పు' అనడం సరికాదన్నారు.

## రేవంత్‌రెడ్డి కంటి పరీక్ష చేయించుకోవాలి : కవిత



**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** హైదరాబాద్ నగరంలోని సల్కం చెరువులో ఉన్న ఫాతిమా కాలేజీపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ చెరువు ఎఫ్ టీఎల్ పరిధిలో లేదంటు న్న సీఎం రేవంత్‌రెడ్డి కంటి పరీక్ష చేయించుకోవాలన్నారు. కవిత 'ఎక్స్' వేదికగా ప్రభుత్వంపై విమర్శలు చేశారు. హైడ్రాను అడ్డం పెట్టుకుని హైదరాబాద్ పేదలను బుల్డోజర్ల కింద నలిపేస్తున్న రేవంత్ సర్కారు ఓవైసీ విద్యాసంస్థలను కాపాడడానికి ఏకంగా కో ర్టులను కూడా తప్పుదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. చెరువును కబ్జా చేసి కట్టిన కాలేజీని ప్రపంచమంతా చూస్తున్నా సీఎంకు మాత్రమే కనిపించడం లేదంటే తక్షణమే ఆయన కంటి పరీక్ష చే యించుకోవాలని ఎద్దేవా చేశారు.

## తెలంగాణలో పెరగనున్న ఎండలు



**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్రంలో నేటి నుంచి ఎండలు పెరుగుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో చెదురుమొదురు వర్షాలు పడతాయి. మిగతా ప్రాంతాల్లో వాతావరణం పొడిగా ఉంటుంది. వానాకాలం ప్రారంభమై 40 రోజులు అవుతోంది. అయినా భారీ వర్షాలు లేవు. నిన్నటి వరకు ఆకాశం మేఘావృతమై ఉంది. నేటి నుంచి ఉష్ణోగ్రతలు పెరుగుతాయని అధికారులు తెలిపారు. తూర్పు తెలంగాణలో 36 నుంచి 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉత్తర తెలంగాణలో 34-36 డిగ్రీల టెంపరేచర్ రికార్డు అవుతుంద ని అధికారులు అంచనా వేశారు. 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంగా గాలులు వీస్తాయి. రుతుపవనాల విస్తరణలో తీవ్ర విరా మం ఏర్పడనుంది. జులై 15 వరకు పెద్దగా వర్షాలు కురిసే అవకాశం లేదు.

## మద్యం మత్తులో ఆర్టీసీ బస్సు చోరీ




**అక్షరటుడే, జనగామ :** ఓ వ్యక్తి మద్యం మత్తులో ఏకంగా ఆర్టీసీ బస్సును చోరీ చేశాడు. ఈ ఘటన జనగామ జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. జనగామ బస్టాండ్‌లో నిలిపి ఉంచిన ఆర్టీసీ అద్దె బస్సును పాలకుర్తికి చెందిన వెంకన్న అనే వ్యక్తి మద్యం మత్తులో దొంగిలించాడు. బస్సును స్టార్ట్ చేసి సూర్యాపేట వైపు సుమారు 21 కిలోమీటర్లు వేగంగా వెళ్లాడు. సింగరాజుపల్లి టోల్ గేట్ వద్దకు రాగానే బస్సు అదుపు తప్పి సిమెంట్ దిమ్మెను బలంగా ఢీకొని ఆగిపోయింది. దీంతో నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు బస్సును స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## స్విట్జర్లాండ్‌లో హైదరాబాద్ జంట అదృశ్యం!

**అక్షరటుడే, హైదరాబాద్:** స్విట్జర్లాండ్ పర్యటనకు వెళ్లిన హైదరాబాద్ దంపతులు అదృశ్యం అయ్యారు. దీంతో వారి కూతురు పోలీసులకు ఫిర్యాదు చేసింది. నగరంలోని కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చక్రపురం, భగవాన్ కాలనీకి చెందిన పబ్బ చంద్రశేఖర్ శ్రీవెంకటేశ్వర మార్కెటింగ్ పేరుతో సిమెంట్ వ్యాపారం చేసేవాడు. ఆయన తన భార్య స్వప్నతో కలిసి జూన్ 22న స్విట్జర్లాండ్ వెళ్లాడు. అనంతరం కొద్ది రోజుల పాటు కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. తర్వాత ఇద్దరి ఫోన్లు స్విచ్‌ఆఫ్ వస్తున్నాయి. వారు ఎక్కడ ఉన్నారో కూడా సమాచారం లేదు. దీంతో వారి కూతురు పబ్బా శ్రేయ చర్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. చంద్రశేఖర్ 30 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నాడు. దీంతో స్థానికంగా చాలా మందితో పరిచయాలు న్నాయి. ఈ క్రమంలో వారి నుంచి రూ.50 కోట్లు అప్పుగా తీసుకొని పారిపోయినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఇదివరకే బాధితులు పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో తాజాగా తమ తల్లిదండ్రులు అదృశ్యం అయ్యారని చంద్ర శేఖర్ కుమార్తె పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.



## హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు.. పలు రోడ్లు మూసివేత



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** హిమాచల్ ప్రదేశ్ కిన్నౌర్ జిల్లా లిప్పా ఖాస్‌లో ఎడ తెరిపి లేని వర్షాలు వర్షాలు కురుస్తున్నా యి. దీంతో కొండచరియలు విరిగిపడి మట్టి, రాళ్లతో కూడిన బురద ప్రవాహం లిప్పా ఖాస్ వంతెనను తాకుతుండ టంతో రాకపోకలను అధికారులు నిలిపివేశారు. వంతెనకు ప్రమాదం ఉందని, నదులు, వాగుల వద్దకు వెళ్లకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రయాణాలు మానుకోవాలని హెచ్చరించారు.

## వయనాడ్‌లో ఏడుకు చేరిన మృతుల సంఖ్య



**అక్షరటుడే, కేరళ :** కేరళలోని వయనాడ్‌లో కొండచరియలు విరి గిపడిన ఘటనలో మృతుల సంఖ్య ఏడుకు చేరింది. ఈ నెల 7న భారీ వర్షానికి కొండ చరియలు విరిగిపడిన విషయం తెలిసిందే. నాలుగు రోజులుగా అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. వయనాడ్ జిల్లా, మెప్పాడిలో ఒక ప్రైవేట్ కంపెనీ సొరంగం తవ్వకం పనులు నిర్వహిస్తున్న ప్రదేశంలో మంగళవారం కొండచరియలు విరిగిపడ్డాయి. గురువారం వరకు కొండచరియల కింద చిక్కుకున్న ఆరుగురు బాధితుల మృతదేహాలను వెలికితీశారు. గల్లంతైన ఇద్దరి కోసం గాలింపు చర్యలు ఈ ఉదయం (జూలై 10) తిరిగి ప్రారంభమ య్యాయి. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ల్యాండ్ సర్వేయర్ రాజేష్, కన్‌స్ట్రక్షన్ మేనేజర్ విక్రమ్ రాణాల కోసం గాలింపు చర్యలు ఈ ఉదయం నాలుగో రోజుకు చేరుకోగా, బాధితుల్లో ఒకరి మృతదేహం లభ్యమైంది. ఎన్‌డిఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ప్రస్తుతం గల్లంతైన మిగిలిన వ్యక్తి కోసం గాలింపులో నిమగ్నమై ఉన్నారు.